క్లుప్తంగా

సీ.క్యాంపు రైతుబజారు తనిఖీ



రైతుబజారులో ఉల్లి ధరపై ఆరా తీస్తున్న జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంపు రైతుబజారును మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తనిఖీ చేశారు. కూరగాయలను బోర్డు రేటుకే విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. శుభ్రతను పరిశీలించారు. త్వరలో చేపట్టబోయే విస్తరణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. సీ.క్యాంపు రైతుబజారును త్వరలోనే మరింత విస్తరించి ఎక్కువ మంది రైతులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య పనులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏడీఎం నారాయణమూర్తి, ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ దాఖలు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో కలర్ డాప్లర్, 2డీ ఎకో కార్డియోగ్రఫీ మిషన్ కొనుగోలుకు పిలిచిన టెండర్ దాఖలు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయింట్ కలెక్టర్, డీపీసీ ఆదేశాల మేరకు గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించామన్నారు. వివరాలను కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనెప్ప విన్నవించారు. శుక్రవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పనిముట్లు, పుష్‌కాట్ బండ్లు, ఎన్నికల భత్యం, సమ్మెకాలపు వేతనం, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యూనిఫాంఇప్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు సంవత్సరాల స్టిచ్చింగ్ చార్జీలు ఇవ్వాలని, రెగ్యులర్ కార్మికులకు యూనిఫాం, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వాలని కోరారు. ఏపీజీ, ఎల్ఐసీ బాండ్లు, హెల్త్‌కార్డులు, డీఏ ఆరియర్స్ ఇప్పించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, రాజశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్‌లైన్ల నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్స్, ఓల్డ్‌టౌన్, ఎస్టేట్ సెక్షన్ల పరిధిలోని కాలనీలలో విద్యుత్ కోతలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఇళ్లు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నపుడు దగ్గరలో విద్యుత్తు లైన్లు, స్తంభాలు ఉంటే విద్యుత్తు శాఖ సిబ్బందికి తెలిపి ప్రామాణిక నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

మండల పరిధిలోని పంచలింగాల 33 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచలింగాల, స్కంద ఫేజ్-3, గొందిపర్ల, ఈ-తాండ్రపాడు, దేవమడ గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు వెల్లడించారు.

విలువిద్య సాధనతో ఏకాగ్రత



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విలు విద్య సంఘం ప్రధాన కార్యదర్శి నాగరత్నమయ్య


కర్నూలు (టౌన్): విలువిద్య సాధనతో ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా విలు విద్య సంఘం ప్రధాన కార్యదర్శి నాగరత్నమయ్య అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు.

• వణికిస్తున్న శునకాలు



బుధవారపేటలో పిల్లలు ఎక్కువగా ఉన్న చోట తిరుగుతున్న వీధికుక్కలు





బుధవారపేట మారెమ్మ గుడి దగ్గర వీధికుక్కలు



కబేళా సమీపంలో తిరుగుతున్న వీధి కుక్కలు

నగరంలో వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. గత నెల 30వ తేదీన ఒకే కుక్క 32 మందిని కరిచింది. వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులతో పాటు దారిన పోయే వారిపై దాడిచేసి కొరికి ఆసుపత్రి పాలయ్యేలా చేసింది. దీంతో వీధికుక్కల విషయంలో తగిన చర్యలు చేపట్టాలని జిల్లా మంత్రి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇదిలాఉండగా నగర వీధుల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పట్టణవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్నారుల చుట్టూ తిరుగుతూ దాడి చేస్తున్నాయి. వీధికుక్కల దాడి ఘటన మరోకటి జరగకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



బుధవారపేటలో...

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



స్వచ్ఛత ఫ్రీడమ్ రన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): ప్రతిఒక్కరికీ శారీరక శ్రమ ఉండాలని, క్రీడల వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన స్వచ్ఛత ఫ్రీడమ్ రన్ కార్యక్రమాన్ని డీఎస్‌డీఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలు ఫిట్‌గా ఉండాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ స్వచ్ఛత ఫ్రీడమ్ రన్‌ను ప్రారంభించారన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని వ్యాయమానికి కేటాయించాలన్నారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రీడలు అవసరం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (టౌన్): ఒత్తిడితో కూడిన చదువుల నుంచి ఉపశమనం పొందాలంటే విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. శుక్రవారం స్థానిక టౌన్ మోడల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు వాలీబాల్, ఆర్చరీ క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్‌పాల్, కర్నూలు అర్బన్ ఎంఈఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకట శేషాద్రి, డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్ తనిఖీ చేశారు. దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, ఏపీజే అబ్దుల్ కలాం మోమెరియల్ మున్సిపల్ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్(బాలికలు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (టౌన్ మోడల్)లను వారు ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత, శుభ్రత, తాగునీటి సదుపాయాన్ని పరిశీలించి, వంట ఏజెన్సీ వారితో, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయా స్కూళ్లలోని విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మధాహ్న భోజన పథకంలో గుర్తించిన లోపాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకళతామన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక గడ్డవీధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెలుగుగేరి సచివాలయం గఫారియా వీధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పరిసరాల శుభ్రత గురించి అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన డయేరియా, దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్త నాగమ్మ, ఆశా కార్యకర్త తిరుపతమ్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలి



మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నిర్మల

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మహిళా హమాలీ కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలని శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మిని కలసి వినతిపత్రం సమర్పించారు. మార్కెట్‌లో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సెక్రటరీ దృష్టికి తెచ్చారు. మహిళా హమాలీ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఎలాంటి గుర్తింపు లేదని పేర్కొన్నారు. వారు చనిపోతే ఎలాంటి నష్టపరిహారం అందడం లేదని, మార్కెట్‌లో మహిళా కార్మికులు పనిచేస్తున్నట్లుగా లైసెన్సులు జారీ చేయాలని సూచించారు. మహిళలకు మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి సానుకూలంగా స్పందించారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, మార్కెట్ యార్డు యూనియన్ల గౌరవాధ్యక్షుడు రాముడు, సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఎస్ స్కిల్స్‌తో ప్రాణాలు నిలపవచ్చు



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర పరిస్థితుల్లో బీఎల్ఎస్ స్కిల్స్ వినియోగించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలో శుక్రవారం ఇంటర్నీస్‌కు బీఎల్ఎస్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె ప్రసంగించారు. అనెస్తీషియా విభాగంలో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఇంటర్నీస్‌కు బేసిక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణకు మొత్తం 265 మంది హాజరయ్యారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, అనెస్తీషియా ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ జి.విశాల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సునియాబేగం పాల్గొన్నారు.

జీవాల పెంపకంపై అవగాహన కల్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): జీవాల పెంపకాన్ని శాస్త్రీయంగా చేపట్టేలా అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా ప్రత్యేక అధికారి, డైరెక్టరేట్ జేడీ మాధవరావు అన్నారు. శుక్రవారం కొండారెడ్డిబురుజు సమీపంలోని పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో జిల్లాలోని పశువైద్యులు, సహాయ సంచాలకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ చేపడుతున్న అన్ని రకాల కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపే కార్యక్రమం జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని సూచించారు. పశువులు, గొర్రెలు-మేకలు, కోళ్ల షెడ్లకు వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి అర్హులను గుర్తించాలని సూచించారు. పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై కూడా అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జేడీ జి.శ్రీనివాస్, డీడీలు దుర్గాప్రసన్నబాబు, హేమంత్‌కుమార్, రాజశేఖర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా కల్లూరు మండలం పర్లలో వెటర్నరీ డాక్టర్‌గా పని చేస్తూ పదోన్నతిపై బదిలీ అయిన వెంకటసుబ్బయ్యను సత్కరించారు.

హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడి ఎన్నిక



రామశంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ (ఉపాధ్యక్షులు)గా జిల్లా మాజీ కలెక్టర్ రామశంకర్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామశంకర్‌నాయక్ మాట్లాడుతూ కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు గుండెజబ్బులపై అవగాహన కల్పించాలని కోరారు. 22 ఏళ్లుగా కర్నూలులో ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ అందిస్తున్న సేవలు బాగున్నాయని కొనియాడారు. ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ వసంతకుమార్, ట్రెజరర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు తనిఖీ



తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని బుధవారపేటలో ఉన్న సుధా వాటర్ ప్లాంటులో శుక్రవారం నగరపాలక ఆరోగ్య, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకపోవడంతో పాటు చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో మున్సిపల్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా వ్యాపారం చేస్తుండటంతో ప్లాంటును సీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాభివృద్ధికి సహకరిస్తాం

కర్నూలు (టౌన్): ఖోఖో క్రీడాభివృద్ధికి సహకరిస్తామని స్పోర్ట్స్ ప్రమోటర్ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఖోఖో జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి



తహసీల్దార్ ఆంజనేయులకు అర్జీలు ఇస్తున్న రైతులు

కల్లూరు: గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పందిపాడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ రీ సర్వే వలన భూముల హెచ్చు తగ్గులు, ఉమ్మడి ఎల్‌పీఎమ్ తదితర సమస్యలపై రైతులు అర్జీలు సమర్పిస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి



డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: ఇంటి పరిసరాలలో మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు తెలిపారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నాయకల్లు గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ములు, గచ్చులు, తొట్లు, పాత టైర్లలో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. అలాగే ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శైలేష్ కుమార్, జిల్లా కమ్యూనిటీ మోబిలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉపాధ్యాయుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన మునిసిపల్ ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, పీఎఫ్ ఖాతాలను తెరవాలన్నారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. మునిసిపల్ హెచ్ఎంలకు అర్బన్ ఎంఈఓలుగా పదోన్నతి కల్పించాలని, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, కంప్యూటర్ ఆపరేటర్లను ఏర్పాటు చేయాలని, అప్‌గ్రేడ్ చేసిన అప్పరీ ప్రైమరీ పాఠశాలలకు సబ్జెక్ట్ టీచర్లను నియమించాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలు దఫాలుగా ఆందోళనలు నిర్వహించామని, భవిష్యత్‌లో అక్టోబర్ 24వన విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటి, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, పూర్వపు జిల్లా కార్యదర్శి సర్వేశ్వరరెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు వరప్రసాదు పాల్గొన్నారు.

దేశభక్తి పాటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర, హంద్రీ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక విజయదుర్గ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. క్విజ్ పోటీల్లో విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల, దేశభక్తి గీతాల పోటీల్లో కేశవ మెమోరియాల్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.వి.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్, విజయదుర్గ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. బీవీపీ తుంగభద్ర తిరుపతి ప్రాంత అధ్యక్షుడు, కర్నూలు శాఖ అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి గుండ సతీష్, బీవీపీ హంద్రీ శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి బుస్సా శ్రీనివాసులు, కోశాధికారి కోదండ రామయ్య పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలి



కర్నూలు విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ: ప్రజలపై వేలాది కోట్ల రూపాలయ ఆర్థిక భారం మోపడానికి ప్రభుత్వం చేపడుతున్న ట్రూ అఫ్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలో విద్యుత్ భవన్ వద్ద సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ అధికారంలో వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నాలుగు నెలలకే సర్‌చార్జీల పేరుతో వేలాది కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్‌చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం సీపీఎం నాయకురాలు నిర్మలమ్మ మాట్లాడుతూ.. విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా పేరిట రాష్ట్ర ప్రజల నుంచి టీడీపీ ప్రభుత్వం రూ.20 వేల కోట్లు వసూలు చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పి గద్దె దింపుతారని హెచ్చరించారు.